# దొంగతనము

గజపతి రాయవర్మ

[దొంగతనం ఒకవృత్తి, వ్యాపారము- దిలాసా-పొరపాటు - కళకూడానేమో ! ఇన్నివిధాలా వింటున్నాం - చూస్తున్నాం కాని ఇలాంటి దొంగతనం విచిత్రంగానే వుంటుంది. విలువైనవస్తువును చేతులారా కోరి ఎత్తుకుపొమ్మని దొంగ కవకాశమిచ్చే ఉదారు డెవడైనా ఉన్నాడా? చదవండి మరి మీరే అంగీకరిస్తారు. కథాధారము అంతా—ఆర్నాల్డు బెనెట్ వ్రాసిన బర్గ్లరీ.—]

“ఏమండోయ్! ఆపటం ఇంకా అక్కడేన్న అలా వుంటే ఇలాంటి సంతోషసమయాల్లోకూడా ఎప్పుడో ఓసారి నేను వాల్తేరు వెళ్లి బుర్ర మరామ్మతు చేయించుకోవాల్సొంటుంది” అం దావిడ.

వాల్తేరులో పిచ్చాస్పత్రి వుంది. కృష్ణ కివతలి వారంతా మానసికమరామ్మత్తు అవసరమైనవార్ని వాల్తేరు తీసుకువెళ్తుంటారు కాని అడపా దడపా ఖర్చు లెక్కువైపోతాయనేమో సగం సగం చికిత్సలోనే ముఖ్యంగా బీదవాళ్లని తరచు వదిలేస్తుంటారు. కావలిస్తే మీరు విశాఖపట్నం వెళ్లి చూడండి రోజు కో పిచ్చివాడైనా మెయిన్‌రోడ్డుమీద కాన్పిస్తాడు.

జాలిగా గోడనున్న పటాన్ని చూస్తూ “దీన్ని చూసి భోజనాని కెళ్తే కక్కొస్తుందికూడా” అంది విమలారావు.

భార్య అసహ్యానికి నవ్వుకుంటూ జగన్నాథరావు పడకకుర్చీలో తాపీగా పీలుస్తూన్న చెరూట్ చివర నుసిలో నిప్పు చూస్తున్నాడు.

ఆ పటం అంటే ఆయనభార్యకే గాదు సాధారణంగా చూపరుల కెవరికైనా వెగటుగానే వుంటుంది. కాని ఆ పటం వెయ్యిరూపాయలపైన కిమ్మత్తు చేసింది. తయారై ఇంకా రెండు సంవత్సరాలైనా కాలేదు. అబ్బే, పాతగిలిందని ఎవరైనా అన్నా బజార్లో పెడితే కనీసం, ఉత్తమచిత్రంకాబట్టీ, రావుగారి రూపపటంకాబట్టీ — ఆరువందలైనా చేస్తుంది.

జగన్నాథరావు ఆ పట్నంలోవున్న అన్ని సంస్థలకూ విరాళా లిచ్చి ప్రజోపకారి అనిపించుకున్నాడు. చక్రవర్తిపటం ఒకటి గ్రంథాలయానికి కొనియిచ్చి తనరాజభక్తిని ప్రకటించుకున్నాడు. ఇతని విరాళాల్తో పదిమంది చదువుకుంటున్నారు. ఇలాంటి వెన్నో ఉపకారాలు చేశాడు. ఈ వితరణానికి డబ్బెక్కడిదయ్యా అని మీ రడగవచ్చును. జగన్నాథరావుతండ్రి గోదావరినీరు తగిలే భూములస్వామి. చనిపోయి ఎక్కడున్నాడోగాని పాపం భూములవల్లనైతే నేం, వడ్డీ వ్యాపారంవల్లనైతే నేం, కొన్నాళ్లు ఆనరరీ మేజస్ట్రీటు చేసినప్పడైతేనేం ఇద్దరు కొడుకులూ ఉద్యోగం చేసుకోనవసరంలే దనిపించే ఆస్తి యిచ్చి మరీపోయాడు. అనంతరం ఆయన రెండోకొడుకు బ్రహ్మచారిగానే వుంటూ జిల్లా అంతటికీ ఓబిజినెస్ మాగ్నెట్ అనిపించుకుని మార్వాడీలు గుజరాతీవాళ్లైనా చిల్లంగిపెట్టేరేమో (ఈర్ష్యవల్ల సుమండీ) అన్నట్టు ఆమధ్యనే ప్రాపకంచేసుకున్న మనోహరానికైనా చెప్పకుండా దానింట్లోనే నీల్గేడు. అప్పుడు జగన్నాథరావు తమ్మునిమరణానికి చాల విచారించి మనోహరాని కొక్కంతభృతి యిచ్చి మిగతాదంతా తన ఆస్తిలో కలుపుకున్నాడు. ఇంతాస్తికీ తనఉద్యోగం రాబడీ కలిపితే ఇక చెప్పాలా?

శాన్నాళ్లనుంచీ ఉన్నవూరికే బదిలీ అయి మేస్ట్రీటుగిరీ చెలాయిస్తూ ఇంకో రెండేళ్లకల్లా రిటైరై పోతాడనగా పౌరులు ఇతన్ని శాశ్వతంగా గౌరవించడం తమ విధి అని గమనించారు. అందుకని ఆయన యెత్తూ, ఆయనఫాయా, హుందాకు తగినట్లుగా ఓమాంచితైలవర్ణచిత్రం తయారుచేయించాలని చందాలు

వేసుకుని ఎలాగైతేనేం వెతికి వెతికి ఓ గొప్పచిత్ర కారుణ్ని రప్పించారు.

చిత్రకారుడు సమ్మతిస్తూనే కొన్ని షరతులు పెట్టాడు. చిత్రం పూర్తయాక దాన్ని అఖిలభారత చిత్రకళాప్రదర్శనానికి పంపి తర్వాతనే పౌరులూ, జగన్నాథరావుగారూ చూడ్డం అన్నాడు. ఎంత గొప్ప చిత్రకారుడూ కాకుంటే అలా అంటాడు? అందుకు పౌరులు సరే అన్నారు.

* * *

విమర్శశిఖామణులూ, పేరొందిన చిత్రకారులూ, కళాప్రియులూ అది సజీవచిత్రం అని మెచ్చుకోడమే కాదు; ఈ చిత్రంవల్ల జగన్నాథరావుగారికీర్తి దశదిశల నిండిపోతుందని వ్రాశారు.

ప్రదర్శనం అయాక పటం పురమాయించినవారికి వచ్చిచేరింది. ఈ చిత్రాన్ని సమర్పించడానికని పౌరులు బ్రహ్మాండమైనసభ ఏర్పాటుచేశారు.

పత్రికావిలేఖరు లప్పటికప్పుడే ఆచిత్రం ఫొటో తీసి శ్లాఘిస్తున్నారు. పౌరులు రావుగారిరూపాన్ని బట్టి ఒరియాదౌడలూ, నీగ్రోపెదిమలూ, మిట్టనొసలూ, జపానుముక్కూ, గణపతికడుపూ ఇవన్నీ తలపుచేసుకుని అసహ్యంగా వుంటుందేమో అని విరగబడి తోడతొక్కిళ్లతో వెళ్లి తీరా చూస్తే చిత్రం అర్థంలేని కలగాపులగం రంగులపులమడంగా కనిపించింది. కాని కొంచెందూరంనుండి చూసినవారు అచ్చంగా మన జగన్నాథరావుగారే అనుకున్నారు.

అంతకుముందే చిత్రకళ అంటే ఏంవిటో తెలియదు కాబట్టి ఆ చిత్రకారునిచేత వ్రాయించిన ఉపన్యాసాన్ని చెప్పి పరమానందభరితుడైపోయినట్లు నటించాడు.

* * *

ఆ పటం జగన్నాథరావుగారిహాల్లో తగిలించిన మూడోమాసంనుంచీ భార్య విమల పటం చూస్తే డోకొస్తుందనడం ప్రారంభించింది. కాని ఎప్పటి కప్పుడు రావుగారు ఆ పటాన్ని విడిచిపెట్టలేనన్నట్లు ఏలాగో సర్దుకుపోయేవాడు - కాని భార్యపోరుకి ఎన్నాళ్లు ఆగ గలడు ?

ఉన్న దున్నట్లు చెప్పాలంటే ప్రజలకే, విమలా రావుకూ ఆ పటం అంటే ఎంత వెగటుగా ఉందో దానికి రెట్టింపురోతగా వుండాతనికి. కాని ఆ జుగుప్స నితరులకు కించిత్తూ తెలియకుండా తనలోనే అణచి పెట్టుకున్నాడు. కొంపకు నిప్పుపెట్టయినా ఆ పటాన్ని విరగడచేసుకో గలడు. దాన్ని పోగొట్టుకోడానికి ఏ మాత్రం వివేక మున్నవాడూ అంతపెద్దమేడకు చేతులారా నిప్పుపెట్టుకోడు. కాని ఆ చిత్రం కంటికెలా దూరం చేసుకోడమా అని రాత్రింబవళ్లు ఆలోచిస్తుండే వాడు.

* * *

ఆ వేళ కోర్టులో ఒక్క గుమాస్తాలూ, సాక్షులూ, పోలీసులేగాకుండా ముద్దాయికూడా మెజస్ట్రేటు తీర్పుకు విస్తుపోయారు.

ఆ మధ్య పట్నం పరిసరాల్లో చిత్రంగా దొంగలు దోచుకుపోతూవుండడం జరిగింది. నానాఅవస్థలూ పడి పోలీసుసబిన స్పెక్టరు ముద్దాయిగా ఒకణ్ని పట్టి తీసుకువచ్చాడు. ముద్దాయికీ దొంగలకూ సంబంధం వుందని ఎస్. ఐ. అనుమానం - దొంగ దొరికాడని పౌరులు తండోపతండాలుగా తీర్పు వినడానికి వచ్చారు.

నేరం ఋజువు కాలేదనీ - సాక్ష్యం చాలదనీ, ముద్దాయి దొంగతనంచేసేంత బలిష్ఠుడుకూడా కాదనీ నిందితుణ్ని విడుదలచేశాడు మేస్ట్రేటు. ఒక్క మేస్ట్రేటు తప్ప అందరూ ఆశ్చర్యపోయారు. జగన్నాథరావు దొంగని అనవసరంగా అనుమానించి అవమానించాం అని అనక ప్రైవేటురూముకు తీసుకరండని చెప్పాడు. వాళ్లు మేస్ట్రేటుగారు నిందితుని కేమైనా బహుమానం చేస్తారేమో అనుకున్నారు.

* * *

వెంకట్రావు మేస్ట్రేటుగారికి దూరంగా తలుపు దగ్గర ఒదిగి నిలిచాడు. దొంగ బలంగా వస్తాదులా ఉంటాడనీ, పగలు చూస్తే రాత్రి కలలోకి వచ్చేంత భయంకరంగా ఉంటాడనీ అంటారు కాని వెంకట్రావులో అలాంటి వేవీ లేవు. ఆదరణ, ప్రతిఫలము లేని సారస్వతోపాసకునిలా బక్కచిక్కి ఉన్నాడు. ఆ

తూపూ అదీ చూస్తే కూటికీ గుడ్డకీ కరువైన మర్యాదస్తునిలా ఉన్నాడు.

"ఇవాళ నక్కని తొక్కి వచ్చావ్" అన్నాడు నవ్వుతూ మేస్ట్రీటు.

ఆయనఅభిప్రాయ మేమిటో తెలుసుకోవాలన్నట్లు వెకిలినవ్వుతో "ఔనండి" అన్నాడు దొంగ.

దొంగ అని నిర్ధారింమకునీ విడిచిపెట్టడంలో మేస్ట్రీట్ ఉద్దేశం వెంకట్రావు గ్రహించలేకపోయాడు.

చమత్కారంగా "దొంగతనం ఏమంత లాభించేదీ!" అన్నాడు ఏదోవూహ తల్లో పెట్టుకున్న మేస్ట్రీటు.

వెంకట్రావు లాభసాటి బేరమే అన్నట్లు నవ్వాడు.

"లాభించేదైనా పాపం పని —— సంఘద్రోహం కాదా ?"

"దొంగతనంగురించి చాలా విన్నానుకాని ఇలా ఎవరూ అనలేదు. అయినా ఈ సారి దొంగతనం ఉత్తమమైనదే అనుకుంటున్నాను; ఏమంటే దొంగతనం వల్ల గొప్పవారితో చనువుగా ప్రవర్తించవచ్చు —".

"ఇదివర కెప్పుడైనా పట్టుబడ్డావా ?"

"తరు చెప్పకూ అలా జరగలేదు; కాని మీ ఉద్దేశం ఏంవిటో తెలుసుకోలేకున్నాను. దయయుంచి త్వరగా పంపితే సంతోషిస్తాను. కాలం నాకు చాల విలువైనది.

జగన్నాథరావు చిరునవ్వుతో కూచోమని సైగ చేశాడు. వెంకట్రావు విముక్తిపొంది అందరిలా స్వతంత్రుడుగా ఉండడంవల్ల నిర్భయంగా వెళ్లి మేస్ట్రీటుకు సమానస్థాయిలో ఆయన కెదురుకుర్చీమీద కూచున్నాడు.

"నేరం అనిపించని దొంగతనం, అంటే న్యాయ సమ్మతంగా ఇతరుల వస్తువులను తీసుకుపోవడంలో నీ అభిప్రాయం ఏంవిటి ?" అన్నాడు మేస్ట్రీటు కొంచెం ఒల్లమీదికి వొరిగి.

"అసలు మీ ఉద్దేశం ఏంవిటో తెలియడంలే" అన్నాడు, ప్రశ్నార్థకదృష్టిని చకితుడైన వెంకటరావు.

జగన్నాథరావు తాపీగా, సాక్షీగా మాట్లాడుట కారంభించాడు.

"మాబంగ్లాలో పెద్ద ఆయిల్ పెయింటింగ్ ఒకటుంది. దాన్నెవరైనా దొంగిలించుకుపోతే బావుండు ననిపిస్తుంది. తెలిసిందా ?"

"దొంగిలించుకు పోవడం!"

"ఔను —. అదెలాగయినా విరగడైపోవాలి. ప్రజలు దాన్నెవరో చోరీచేసుకుపోయా రనుకోవాలి."

"ఏ అర్ధరాత్రి సమయానో మీరే చాటుగా తీసి తగలెట్టకూడదూ ?"

"అది మోసం అవుతుంది. నువు చెప్పినట్లే చేస్తాననుకో — ప్రజలతో దొంగిలింపబడినదని చెప్పడం ఏం సబబుగా వుంటుంది? వాస్తవంగా దొంగిలింపబడాలనే నీతో చెప్పడం."

"సరే ఏమిస్తారు?" అన్నాడు వర్తకసరళిని వెంకట్రావు.

"డబ్బివ్వాలా?"

"ఔను — దాన్నెత్తుకుపోవడానిగ్గాను ఏం బహుమతి చేస్తారు?"

అంతఖరీదైనపటం ఎత్తుకుపొమ్మంటుంటే వేరే ఇందుకు పారితోషికం యివ్వాలా అని మేస్ట్రీటు ఆంతరంగికంగా దాచే పిసినారితనం వెల్లడించుకున్నాడు. వేయిరూపాయలపటం దొంగిలించుకుపోడానికి అవకాశం యిస్తుంటే ఇంకా బహుమానం ఇవ్వాలిట. ఏకలకత్తాలోనో అమ్మకుంటే చచ్చుగా ఎనిమిదివందలైనా తెస్తుంది. దీని కింకా బేరమా? ఆపటాన్ని ప్రజలంతా విగబడి చూశారు పత్రిక లలాంటి చిత్రం ఇంతవరకు తయారుకాలేదని శ్లాఘించాయి అంటూ చిత్రప్రాశస్త్యాన్నిగురించి వివరాలతో మేస్ట్రీటు ఓ ఉపన్యాసం ఇచ్చాడు.

"నిజంగా మీరు చెప్పేంత గొప్పదే అయితే దాన్ని పోగొట్టుకునే ప్రయత్నం ఎందుకు?"

"అదనోయ్ బాబూ - ఘట్టిడక్కు. ఆ పటం అంటే నాకు పరమఅసహ్యం. ఇక మా ఆవిడకోసం

చెప్పనక్కర్లేదు. ఆఖరుక్కు మాపిల్లలూ-నౌఖర్లకూడా అసహ్యమే. ప్రజలంత ప్రయాసపడి తెచ్చినదాన్ని చేతులారా కాల్చివేయడం నా కేం యిష్టంలేదు. అందుకే ఆ పటాన్నే బహుమతి అనుకుని తీసుకుపొమ్మంటున్నాను."

"పెద్దల్ని కాదనడం నా కిష్టంలేదు. మీ మాట ప్రకారం ఈమాత్రంసహాయం చేయగల్గుతా ననుకోండి. అదేం వెండీ బంగారం కాదాయె కరగించుకుని అమ్ముకోడానికి. అదిగాక మీమాటలవల్ల ఆ పటం అందరెరిగినదల్లే తెలుస్తుంది; పోనీ అమ్ముకుందా మన్నా ఇదో అడ్డు వుందే!"

"అసందర్భం! నీవు తలిస్తే ఎవరిచేతనైనా పంపి ఫారిన్‌లో అమ్మించగలవు. విదేశాల్లో ఇలాంటివి సులభంగా అమ్ముడుపోతవి. అప్పుడు చూసుకో నీ అదృష్టం. రెట్టింపిచ్చైనా కొంటా రక్కడ. ఓ ఏడాదిపాటు ఎక్కడైనా దాచి వుంచి తర్వాత ఆ పని చేయి."

వెంకట్రావు అంగీకారసూచకంగా తలూపి మేజామీద తబలా కొట్టినట్లు వ్రేళ్లాడిస్తూ హఠాత్తుగా "సరే ఏంజేయను మరి - మీ రింతగా చెప్తుంటే చేయననడం బాగుండదు. కాబట్టి పట్టుకుపోతాలెండి" అన్నాడు మహాజాలిగా.

మేస్ట్రీటు సంతోషాన్నీ ఆత్రుతనీ కష్టంగా ఆపుకుంటూ "ఎప్పుడు! రాత్రికి!!" అన్నాడు.

"అబ్బే! కుదరదు. ఇవాళరాత్రికి నాకు వేరే పని వుంది."

"పోనీ రేపురాత్రికి?—".

"రేపూ కుదరదు. రేపటికే కార్యక్రమం నిర్ణయించుకున్నాం".

"అలాయితే నీ కింక తీరికవుండే దెప్పుడు?"

"మీ కిది తేలికగా కనిపిస్తున్నట్లుంది.—ఎల్లుండి రాత్రికైతే మీ కాపని చేసిపెట్టగలను."

"పొంగలికు వెళ్లి మా ఆవిడ్ని తీసుకొద్దా మనుకుంటున్నానే! పండుగకూడానే!!"

"పండుగైతేనేం? పోనీ మర్నాడు రమ్మంటారా? ఆవేళ తప్పితే మళ్లా నాకు పని వుంది".

"సరేలే — నీకు వీలవదన్నప్పు డేంచేస్తాను?— మరి బంగ్లాప్లాను యివ్వనా?— నీకు సులువుగా..."

"మీ మేడప్లానే నాకు తెలియ దనుకుంటూన్నారా? నే నేం కొత్తగా వినోదానికి దిగినవాడ్ని కాను - నా వ్యాపారంసంగతి మీ కాట్టే తెలియనట్లుంది".

పటం దొంగిలించుకపోడానికి వెంకట్రావు సూచనలను పరిశీలిస్తూ, అతడ్ని మెచ్చుకుంటూ సంతోషంగా తలూపాడు మేస్ట్రీటు.

* * *

జగన్నాథరావు పండుగఅని ఆవాళ నౌఖర్లందరకూ మామూళ్లిచ్చి సెలవు యిచ్చాడు. ఆవాళ్నే ఏదో మిష పెట్టి రెండురోజు లా: స్యంగావస్తున్నానని పుట్టింటనున్న భార్యకు జాబూ వ్రాశాడు.

రాత్రి భోజనానంతరం ఒంటరిగా చుట్ట కాల్చుకుంటూ నిశ్శబ్దంగా ఆ పటాన్ని చూస్తూ కూచున్నాడు.

కార్యక్రమం అంతా సవ్యంగానే జరుగుతుం దనుకున్నాడు. కాదూ? మరి — ప్రజలు నిజంగా పటాన్నెవరో దొంగిలించారని నమ్మితీరతారు. బంగ్లాలో స్వేచ్ఛగా తిరగమని దొంగకు అవకాశమీయడం మేస్ట్రీటు కిష్టంలేదు. కార్యక్రమం ఎలా కొనసాగిందో స్వయంగా చూడా లనుకున్నాడు. కాని మళ్లీ దొంగ కింతవీలివ్వడంవల్ల ఏం అనర్థమొస్తుందోఅని శంకించాడు. పటం పోతుందనేఆనందం ఆసంకోచాన్ని తరిమివేసింది. అదిగాక దొంగ చిల్లరమల్లరవాడూ కాదు. చాల నమ్మకంగా ప్రవర్తించాడు.

ఇన్ని ఆలోచనలలో ఆపటం చూస్తుంటే తలుపుకొచ్చే అసహ్యం అది పోగొట్టుకోగల్గుతున్నాననే సంతోషంలో మాయమైపోయినది. పటాన్ని పోగొట్టుకోడానికి అతడు ఇంటికి నిప్పుపెట్టుకోడానికైనా సంసిద్ధుడేకాని తీరా నిప్పంటిస్తే ఏ ఫైరింజనో వచ్చి ఆర్పేస్తుందేమో! మూర్ఖప్రజలు పటాన్నైనా కాపాడాలనిదాన్నెక్కడ తగులడకుండాచేస్తారో! ఇన్ని వ్యయప్రయాసలకు లోనవక్కర్లేకుండా దొంగిలించుకు

పోతున్నాడు వెంకట్రావు. అతడు దీన్నెత్తుకుపోతే ప్రజలు ఇది అవశ్యం దొంగిలింపబడిందని విశ్వసిస్తారు.

విరగడైపోతావులే అని జగన్నాథరావు పటం చూశాడు. మిలమిల్లాడే పైడిపూత చట్రంమీదికి దృష్టి పోయింది. ఈ వెండిచట్రంకూడా ఎత్తుకుపోతాడేమో! అబ్బే అలాంటి దొంగ కాడని తన్నుతా నోదార్చుకున్నాడు.

వెంకట్రావుతో నిర్ణయించుకున్న ప్రకారం గడియలు తీసి, దీపాలు ఆర్పి నెమ్మదిగా పడకగదిలో ప్రవేశించాడతడు. మంచంఅయితే ఎక్కాడుకాని నిద్రరాదు. అసలు నిద్రపోవడంఅనేది కుదరదు. నిద్రపోవాలనేఆశా లేదు. జరుగబోయేదంతా తెలుసుకోవాలనే చెవులు రిక్కించుకు పడుకున్నాడు.

అర్ధరాత్రిని, అంటే సరీగ్గా వెంకట్రావు వస్తానన్న ఘడియకు ఏదో అలుకుడైనట్లు భావించుకున్నాడు. వెంకట్రావు ఆడితప్పనివాడు, సరీగ్గా చెప్పినఘంటకు వచ్చేడనుకుని సంతోషించాడు. నిజానికి దొంగకూడా సరీగ్గా అప్పుడే వచ్చాడు.

మేస్ట్రీటు చేతనైనంతసేపూ ఓపిక పెట్టి ఏమి జరిగిందో చూతామనేకుతూహలా న్నిక ఆపుకోలేక నెమ్మదిగా లేచి చెట్టుతొర్రలోంచి తొంగిమానే వడ్రంగిపిట్టలా కిటికీలోంచి చూశాడు. పూలమొక్కల కావల ఇద్దరు నల్లగా కనిపించారు. ఇద్దరూ ఏదో మోసుకుపోతున్నట్లు కనిపించింది. ఇకనేం పటం నలిగిపోకుండా పట్టుకుపోతున్నారని వాళ్ళిద్దర్నీ చూపుకందినంతసేపూ ముచ్చటగా చూశాడు.

* * *

తెల్లవారింది. వంటవాడు లేస్తాడుగదా—నౌఖర్లూ వాళ్లూ వస్తారు. పటం పోయినట్లు వాళ్ల తెలుసుకున్నాకనే వెళ్లి తన కేమీ తెలియనట్లు నటించాలనుకున్నాడు జగన్నాథరావు. కాని ఒకసారి వాళ్ళ కన్నా ముందే చూస్తే ఎలా వుంటుందో?

గబగబా కిందికి దిగి వెళ్లి బోగన్విల్లా కవతల పరిచివున్న దేంవిటా అని చూశాడు.

"దీని ఉపయోగం నా కేంవీ లేదని విడిచిపెట్టినందుకు క్షమించాలి" అని తెల్లటి అక్షరాలు కనిపించాయి. పరికించి చూచాడు. ఇం కేముంది - పోతుందని సంబరంపడిన పటం — ఒక్క చట్రంమాత్రమే పట్టుకుపోయాడు దొంగ!— ఎంత నమ్మకద్రోహం!

ఆ చిడిముడిపాటులో ఇల్లంతా తిరిగేశాడు, ఫ్లవరువేసులూ, అద్దం, దువ్వెన్లూ, టాయిలెట్ టేబిలుమీదవీ, వంటింట్లోవీ ఒక్క వెండిసామానైనా కనిపించక జరిగినమోసానికి వెర్రెత్తిపోయింది జగన్నాథరావుకి.